ప్రజాశక్తి
బుధవారం 15, మార్చి 2023
5
అనంతపురం



హంపాపురంలో డిఇఒ 'నైట్ విజన్'

అనంతపురంసిటీ : నైట్ విజన్‌లో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎం సాయిరాం మంగళవారం అనంతపురం రూరల్ మండలం హంపాపురం గ్రామంలోని ఓ పదో తరగతి విద్యార్థి ఇంటికి వెళ్లి విద్యాభ్యాసంపై ఆరాతీశారు. ఇందులో భాగంగా విద్యార్థి ఇంటి దగ్గర ఏవిధంగా చదువుతున్నాడు.. అని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా నోటుబుక్కులను టీచర్లు కరెక్షన్ చేశారా.. లేదా.. అని ఆరాతీశారు. అదేవిధంగా 8వ తరగతి విద్యార్థులు బైజ్యూస్ ట్యాబులను వినియోగిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నాయని, సమయాన్ని వృథా చేయకుండా బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. ముఖ్యంగా పిల్లలను టీవీలు, సెల్ ఫోన్లకు దూరంగా ఉంచి చదువుకునేలా ప్రోత్సహించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఒ బాలమురళీకృష్ణ, ఏపీఓ నారాయణ స్వామి, టీచర్లు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కౌంటింగ్ సిబ్బంది. ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ సుదీర్ఘ ప్రక్రియ

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి
కౌంటింగ్ సిబ్బందికి కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచన

ప్రజాశక్తి-అనంతపురం

దశల వారీగా సుదీర్ఘంగా సాగే ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో కౌంటింగ్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం జేఎన్టీయూలో కౌంటింగ్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎన్నికల పరిశీలకులు పోలా భాస్కర్, హరిజవహర్‌లాల్ లు పాల్గొన్నారు. ఉమ్మడి కడప, అనంతపురము, కర్నూల్ జిల్లాల నుంచి కౌంటింగ్‌లో పాలుపంచుకోనున్న సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఓట్ల లెక్కింపులో చెల్లని ఓట్లను గుర్తించడం, ప్రాధాన్యతా ఓట్లను అభ్యర్థులకు బదిలీ చేయడం, అంతిమంగా విజేతను ప్రకటించడం వంటి అంశాలపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండు, మూడు రోజుల పాటూ జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సిబ్బంది మానసికంగా సిద్ధంగా ఉండాలన్నారు. సిబ్బందికి అనుకూలంగా ఉండేందుకు రోజుకు మూడు షిఫ్టుల వారీగా కౌంటింగ్ నిర్వహించనున్నామన్నారు. అభ్యర్థులు సైతం షిఫ్టుల వారీగా కౌంటింగ్ ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. కడప-కర్నూల్-అనంతపురము పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల కౌంటింగ్‌లో రిజర్వుడు సిబ్బందితో కలిపి దాదాపు 600 మంది పాల్గొననున్నారని తెలిపారు. ఎన్నికల పరిశీలకులు పోలా భాస్కర్, హరి జవాహర్‌లాల్ లు మాట్లాడుతూ కౌంటింగ్ ఏజెంట్లు, అభ్యర్థులను సమన్వయపరుచుకుంటూ ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో గాయత్రీదేవి, డీఆర్డీఏ పీడీ నరసింహా రెడ్డి, ఆర్డీవో మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ వైపే అంచనాలు

తాయిలాలపైనే అధికారపార్టీ నమ్మకం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మండలి ఎన్నికల పోలింగు సోమవారం ముగిసిన విషయం తెలిసిందే. ఇప్పుడు గెలుపెవరిదై ఉంటుందన్నదే సర్వత్రా సాగుతున్న చర్చ. అత్యధికంగా పిడిఎఫ్ (ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్) అభ్యర్థులుగా బరిలోకి దిగిన పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలకే ఎక్కువ విజయావకాశాలున్నట్టు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోందంటున్నారు. ఉద్యోగులు, నిరుద్యోగులు సైతం ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారన్నది ఓటింగు జరిగిన తీరు స్పష్టం చేస్తోందని అంచనా వేస్తున్నారు. సాధారణంగా పట్టభద్రులకు సంబంధించి ఓటింగు ఈ ఎన్నికల్లో కొంత బాగా జరిగిందనే చెప్పవచ్చు. ఎక్కువ పోలింగు జరిగిందంటే అది ప్రభుత్వ వ్యతిరేకతను స్పష్టం చేస్తుందని రాజకీయవర్గాలు భావిస్తుంటాయి. పట్టభద్రులకు సంబంధించి చూస్తే పశ్చిమ రాయలసీమ నియోజకవర్గం పరిధిలో 49 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఈ ఎన్నికలకు సంబంధించి 330124 ఓట్లు ఉంటే 244307 ఓట్లు పోలయ్యాయి. 74 శాతం ఓటింగు జరిగింది. సాధారణంగా అయితే 60 శాతం లోపే జరిగేవి. ఈసారి మాత్రం 74 శాతం పోలింగు జరిగిందంటే అది ప్రభుత్వ వ్యతిరేకతకు సంకేతమని చెప్పవచ్చు. ఇక ఉపాధ్యాయ నియోజకవర్గానికి వచ్చే సరికి మొత్తం 12 మంది అభ్యర్థులు పోటీ చేశారు. 28148 ఓట్లు ఉంటే 25884 ఓట్లు పోలయ్యాయి. 91.96 శాతం ఓటింగు జరిగింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి పిడిఎఫ్ అభ్యర్థులకు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలతోపాటు, ప్రజాసంఘాల మద్దతు బలంగా ఉంది. పెద్దఎత్తున ప్రచారాలు నిర్వహించడంతోపాటు, ప్రభుత్వం ఇచ్చిన హామీలు, అమలు చేయకపోవడం వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లగలిగారు. దీంతో పిడిఎఫ్ అభ్యర్థులకు అన్ని వర్గాల నుంచి మద్దతు ముందు నుంచి లభిస్తూ వచ్చింది. ఇది పోలింగులోనూ స్పష్టంగా కనిపించదని విశ్లేషకులు సైతం చెబుతున్నారు. ఇక అధికారపార్టీ మద్దతుదారులు మాత్రం తమకు అనుకూలంగా జరిగిందని చెబుతుండటం గమనార్హం. ఏ ఇతర అభ్యర్థులు తమలాగా ఓటర్లకు తాయిలాలు ఇవ్వలేదని చెబుతున్నారు. తాయిలాలు చాలా వరకు పనిచేస్తాయన్న నమ్మకాన్ని పెట్టుకున్నారు. అయితే ఎవరికి అనుకూలంగా ఓటర్లు తీర్పు ఇచ్చారన్నది ఈనెల 16వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపుతో తేలనుంది. ఇప్పటికే ఓటరు తీర్పు ఇచ్చియున్నారు. ఇచ్చిన తీర్పు బ్యాలెట్ బాక్సుల్లో భద్రంగా ఉన్నాయి. పోలింగు ముగిసిన నేపథ్యంలో బాలెట్ బాక్సులు మంగళవారం నాడు జిల్లాలోని జెఎన్‌టియు కళాశాలకు చేరాయి. ఓట్ల లెక్కింపు ఇక్కడే జరగనున్నందున, ఆరు జిల్లాల నుంచి బ్యాలెట్ బాక్సులు అనంతపురంకు తీసుకొచ్చారు. ఈ బాక్సులను స్ట్రాంగు రూముల్లో భద్రపరిచారు. అదే విధంగా మంగళవారం ఉదయం రిటర్నింగు అధికారి అయిన జిల్లా కలెక్టరు ఎస్.నాగలక్ష్మి మైక్రో అబ్జర్వర్ల ద్వారా ఓటింగుకు సంబంధించిన స్క్రూటినీ పూర్తి చేశారు. అనంతరం ఓట్ల లెక్కింపుపైనా లెక్కింపు సిబ్బందితోనూ ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రేపు జరిగే ఓట్ల లెక్కింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. ఈ ఓట్ల లెక్కింపుతో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.





పెద్దవడుగూరులో సోమవారం ఓటువేసేందుకు బారులు తీరిన ఓటర్లు . ఇన్‌సెట్‌లో పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు



అటెండెన్స్ రిజిస్టర్లు పరిశీలిస్తున్న డిఇఒ సాయిరాం

పాఠశాలలో లోపాలను సరిదిద్దుకోవాలి

లేదంటే చర్యలు డీఈవో సాయిరాం

ప్రజాశక్తి- అనంతపురం సిటీ

పాఠశాలలో ఉన్న లోపాలను వెంటనే సరిదిద్దుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.సాయిరాం హెచ్చరించారు. మంగళవారం అనంతపురం నగరంలోని రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాలను డీఈవో ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతి గదిల్లోకి వెళ్లి విద్యార్థుల వర్క్ బుక్‌లను పరిశీలించారు. బైజూస్ ట్యాబులను వినియోగిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం హెచ్ఎం చాంబర్‌కి వెళ్లి ఉపాధ్యాయులు, విద్యార్థుల అటెండెన్స్‌ని పరిశీలించారు. ఏ సబ్జెక్టుకు ఎంతమంది టీచర్లు ఉన్నారు..అకడమిక్ క్యాలెండర్ ఉందా లేదా అని హెచ్ఎంని అడిగి తెలుసుకున్నారు. చాలామంది విద్యార్థులు కొన్ని రోజులుగా పాఠశాలకు రాకపోవడం, తరగతి గదులు అధ్వానంగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ఇచ్చారా? లేదా?, మధ్యాహ్నం భోజనం అందరూ తింటున్నారా లేదా అని ఆరా తీశారు. మధ్యాహ్నం భోజనం మెనూని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు సిలబస్ పూర్తి అయిందా? లేదా? అని హెచ్ఎం, టీచర్లతో మాట్లాడారు. టీచర్ల డైరీలను క్షుణ్ణంగా పరిశీలించారు. డైరీలు అప్‌డేట్ లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. నోటు బుక్ లను ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు కరెక్షన్ చేయడం లేదని గుర్తించారు. గత రెండు వారాలకు సంబంధించిన విద్యార్థుల అటెండెన్స్ రిపోర్టు ఇవ్వాలని హెచ్ఎంని ఆదేశించారు. ఉపాధ్యాయులు పాఠాలు చెప్పడమే కాకుండా నైట్ విజన్ కూడా నిర్వహించాలని ఆదేశించారు. నైట్ విజన్ అదనపు పని అనుకోకూడదని అన్నారు. పది ఫలితాల పెంపు కోసం అందరూ కృషి చేయాలని సూచించారు. ఎనిమిదో తరగతి విద్యార్థులు ట్యాబులు వినియోగిస్తున్నారో లేదో రోజూ పర్యవేక్షించాలన్నారు. ట్యాబులు కచ్చితంగా వినియోగిస్తామని 8వ తరగతి విద్యార్థులతో ప్రతిజ్ఞ కూడా చేయించాలన్నారు. పాఠశాలలో ఉన్న లోపాలను వెంటనే సరిదిద్దుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని డీఈవో హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిసిఇబి సెక్రెటరీ లోకేశ్వర్ రెడ్డి, ఏపీవో నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుండే ఆరోగ్య సూత్రాలు పాటించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

విద్యార్థి దశ నుండే ఆరోగ్య సూత్రాలు పాటించి ఆరోగ్యవంతమైన జీవితాన్ని కొనసాగించాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తి మండల పరిధిలోని ఎనుములపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకటి నుండి 19 సంవత్సరాల లోపు విద్యార్థినీ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను ఆయన పంపిణీ చేశారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తరపున ప్రతి ఆరు నెలలకు ఒకసారి 1 నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నారన్నారు. అంగన్‌వాడీ, విద్యాశాఖ, ఆరోగ్యశాఖ అధికారుల తరపున అల్బెండజోల్ మాత్రలను బడి పిల్లలతో పాటు బడి బయట ఉన్న పిల్లలందరికీ మాత్రలను పంపిణీ చేస్తున్నామన్నారు. పిల్లలు మిస్ అయితే వారికి మళ్లీ ఈనెల 18వ తేదీన అల్బెండజోల్ మాత్రలను వేస్తామని చెప్పారు. కడుపులో నులి పురుగులు ఉండడం వల్ల చదువుపై శ్రద్ధ తక్కువగా ఉంటుందన్నారు. అనేక రకాల అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. నులిపురుగుల వల్లనే ఇలాంటి లక్షణాలు వస్తాయనేది తెలియదన్నారు. అనంతరం కలెక్టర్ పుట్టపర్తిలోని సాయి సనాతన మాంటిస్సోరి స్కూల్లో చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కలెక్టర్ ముందుగా తన మనవడు కిరీటి విరాజ్‌కి మాత్రలు వేసి, తదనంతరం చిన్నారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సతీమణి అనిత, డిఎంహెచ్ఒ ఎస్‌వి.కృష్ణారెడ్డి, డాక్టర్లు నివేదిత, ఫణీంద్ర, జోత్స్న సిడిపిఒ గాయత్రి, సూపర్‌వైజర్ లక్ష్మన్న, మునిసిపల్ కౌన్సిలర్లు నాగమణి, సరస్వతి, ఎంఇఒ వెంకటరమణ నాయక్, హెల్త్ సెక్రెటరీ పరిమళ, హెల్త్ అసిస్టెంట్లు అజీజ్ ఖాన్, సూరశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిత్యం రద్దీగా ఉండే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఖాళీగా దర్శనమిస్తున్న దృశ్యం

సర్వర్ షట్ డౌన్..

నిలిచిన ప్రభుత్వ సేవలు ఇబ్బంది పడ్డ ప్రజలు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ సర్వర్ మంగళవారం ఒక్కసారిగా షట్ డౌన్ అయింది. దీంతో ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రజలు సైతం ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రతి రోజూ ఉదయం విధులకు హాజరైన వెంటనే ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో ముఖ ఆధారిత హాజరు వేయాల్సి ఉంటుంది. అయితే ఉదయం నుంచి సర్వర్ పని చేయకపోవడంతో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ముఖ ఆధారిత హాజరు సైతం వేయలేకపోయారు. దీంతో పాటు నిత్యం కళకళలాడే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఒక్కసారిగా బోసిపోయింది. ఆర్థిక సంవత్సరం చివరి నెల కావడంతో పట్టణ ప్రజలు ఇంటి పన్నులు, నీటి పన్నులతో పాటు ఇతర పన్నులు చెల్లించడానికి మంగళవారం పురపాలక సంఘం కార్యాలయానికి వచ్చారు. సర్వర్ పని చేయకపోవడంతో వెనుతిరిగారు. వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం, మండల తహశీల్దార్, మండల పరిషత్ కార్యాలయం ఇలా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సర్వర్ పనిచేయకపోవడంతో ప్రభుత్వ సేవలన్నీ ఒక్కసారిగా నిలిచిపోయాయి. దీంతో వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో పాటు సబ్ రిజిస్టర్ కార్యాలయానికి వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది రిజిస్టర్, ఇసితో పాటు వివిధ సేవల కోసం వచ్చి వెనుదిరిగారు. సర్వర్ పనిచేయక పోవడంతో పనులు లేక అధికారులు, సిబ్బంది కార్యాలయంలో ఖాళీగా ఉండిపోయారు. దీంతో ఒక్క సబ్ రిజిస్టర్ కార్యాలయం నుంచి ప్రభుత్వానికి వచ్చే ఆదాయం దాదాపు రూ.5 లక్షలకు పైగా నష్టం జరిగింది. దీంతో పాటు మున్సిపల్, వాణిజ్య పన్నుల శాఖ, రవాణ శాఖ తరపున అందే ఆదాయం అంతా నిలిచిపోయింది.

రోజుకు 50 వరకు డాక్యుమెంట్లు రిజిస్టర్ అయ్యేవి సబ్ రిజిస్ట్రార్ శేఖర్‌రెడ్డి

హిందూపురం సబ్ రిజిస్టర్ కార్యాలయం పరిధిలో దాదాపు రోజుకు 50 వరకు వివిధ రకాల డాక్యుమెంట్లు రిజిస్టర్ జరిగేవి. ఉదయం నుంచి సర్వర్ పని చేయక పోవడంతో ఒక్కటి సైతం రిజిస్టర్ చేయలేదు. దీంతో మంగళవారం కార్యాలయానికి దాదాపు రూ.5 లక్షల వరకు ఆదాయం తగ్గింది.

సమసమాజ దార్శనికుడు కారల్‌మార్క్స్

సిపిఎం ఆధ్వర్యంలో కారల్ మార్క్స్ వర్ధంతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కార్మికులు, శ్రామికులు వెట్టి చాకిరి, శ్రమ దోపిడి నుంచి విముక్తి పొందేలా సమ సమాజ స్థాపనకు కృషి చేసిన సమాజ దార్శనికుడు కారల్ మార్క్స్ అని సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి అన్నారు. మంగళవారం సిపిఎం నగర 1వ కమిటీ ఆధ్వర్యంలో మహా మేధావి, మహోన్నత వ్యక్తి కారల్ మార్క్స్ 140వ వర్ధంతి సభ నిర్వహించారు. సిపిఎం నాయకులు మసూద్ అధ్యక్షన ఆర్‌టిసి బస్టాండ్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ కారల్‌మార్క్స్ ప్రపంచంలో ఉన్న కార్మికులను, కర్షకులను పెట్టుబడిదారులు, భూస్వాములు ఏ విధంగా తమ శ్రమను దోచుకుంటున్నారో సమాజానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి కారల్‌మార్క్స్ అన్నారు. పీడితులకు ఒక దారి చూపిన మహోన్నత వ్యక్తి అన్నారు. ప్రపంచంలో కార్మికులను పెట్టుబడిదారులు ఏ విధంగా మోసం చేస్తున్నారో వారి శ్రమను ఏ విధంగా దోచుకుంటున్నారో, పెట్టుబడిదారుల సంపద ఏ విధంగా పోగుపడుతోందో క్యాపిటల్ బుక్‌లో వివరించారని తెలిపారు. 170 సంవత్సరాల కిందట రాసిన పుస్తకం ఇప్పటికీ అనేక మంది దానిని చదువుతూ ప్రపంచంలో జరుగుతున్న ఆర్థిక సంక్షోభాల నుంచి ఎలా బయటపడాలో పెట్టుబడిదారులు కూడా ఆ పుస్తకాన్ని అధ్యయనం చేస్తున్నారని తెలిపారు. మానవ సంబంధాలు అన్నీ ఆర్థిక సంబంధాలే అని చెప్పిన మేధావి మార్క్స్ అని తెలిపారు. ప్రపంచ కార్మికులారా ఏకంకండి పోరాడితే పోయేది ఏమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అన్న గొప్ప విప్లవవీరుడు మార్క్స్ అని కొనియాడారు. కమ్యూనిస్టులకు దిశా నిర్దేశం కోసం కమ్యూనిస్టు ప్రణాళికను మార్క్స్ ఏంజెల్స్ రచించిన పుస్తకమే ఇప్పటికీ కమ్యూనిస్టు సిద్ధాంతానికి ఉపయోగపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు వెంకటనారాయణ, ప్రకాష్, వలీ, బాబు, ఎన్టీఆర్ శీన, ప్రసాదు, లక్ష్మీనారాయణ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యచంద్ర, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాలకష్ణ, నూరుల్లా, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, ఆటో యూనియన్ నాయకులు శివ, నాగరాజు, గౌడ్, భవాని శీన, వన్నూరప్ప సాంబ, ఇస్మాయిల్, రవి తదితరులు పాల్గొన్నారు.



కారల్‌మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఇంటింటికీ రేషన్ ఏదీ..?

అటకెక్కిన బియ్యం పంపిణీ

ప్రజాశక్తి-కుందుర్పి

లబ్ధిదారుని ఇంటి వద్దకే రేషన్ బియ్యం అందించాలన్న సిఎం జగన్ ఆశయం నీరుగారుతోంది. ప్రతిపక్షంలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంటింటికీ రేషన్ ఇవ్వాలని రూ.కోట్లు ఖర్చు పెట్టి వాహనాలను తీసుకొచ్చారు. వాహనాలను నడిపేందుకు డ్రైవర్లకు సైతం జీతాలు ఇస్తున్నారు. అయినా ఆశయం మాత్రం నెరవేరడం లేదు. ముఖ్యంగా కుందుర్పి మండలంలో ఎండిఎం వాహనాలను మూలకు వేసి ప్రభుత్వం నుంచి వస్తున్న డబ్బులు మాత్రం తీసుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలవ్యాప్తంగా 17,630 రేషన్ కార్డుదారులు ఉండగా 42 చౌక దుకాణాలు ఉన్నాయి. వీటి నుంచి ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసేందుకు 10 ఎండిఎం వాహనాలను మంజూరు చేశారు. అయితే ఏ వాహనం కూడా సకాలంలో బియ్యాన్ని లబ్ధిదారిని ఇంటికి చేర్చడం లేదు. దీంతో వికలాంగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండిఎం వాహనదారులు, చౌక దుకాణ డీలర్లు, రెవెన్యూ యంత్రాంగం కుమ్మక్కై ఇష్టరాజ్యంగా రూ.లక్షలు దుర్వినియోగం చేస్తున్నారని విమర్శలు వినిస్తున్నాయి. ఒక్కో వాహనదారుడికి ప్రభుత్వం నెలకు రూ.21,500, డ్రైవర్‌కు రూ.18,500 అందిస్తోంది. అయితే వాహనాలను తిప్పకుండా ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సక్రమంగా ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కుందుర్పి మండలంలో మూలన పడిన ఎండిఎం వాహనం

చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడుదాం..

జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంలో వక్తలు


ఉరవకొండలో ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-ఉరవకొండ

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల పరిధిలోని చిన్నముష్టూర్ గ్రామంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ అష్రఫ్ అలీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో నులిపురుగులు ఉంటే రక్తహీనత, శారీరకంగా, మానసికంగా ఎదుగుదల లేకుండా పోవడం, అనారోగ్యంతో అలిసిపోయినట్టుగా ఉండటం, రాత్రి పూట ఎక్కువగా మూత్ర విసర్జన, కడుపునొప్పి, నీరసం, గుండె పరిమాణం ఎక్కువ కావడం, కాళ్లవాపులు వంటి లక్షణాలు ఉంటాయన్నారు. కావున ప్రతి చిన్నారికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. నులిపురుగులను నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏడాదిలో రెండుసార్లు మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నులి పురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది సురేష్‌బాబు, సులోచన, వెంకటేష్ నాయక్, ఆలీ హుస్సేన్, చిన్న ముష్టూర్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అలాగే విడపనకల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైద్యాధికారి శ్రీధర్ ఆధ్వర్యంలో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నపిల్లలను ఆరోగ్యవంతమైన భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం రెండుసార్లు నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్న లక్ష్మి, సిబ్బంది ప్రమీలాదేవి, కమ్యూనిటీ హెల్త్ అధికారిణి మునెమ్మ, ఆరోగ్య పర్యవేక్షకులు శర్మస్ వలి, ఎఎన్ఎం శ్రావణి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరు మండలంలో ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్యసిబ్బంది

శింగనమల : చిన్నారుల్లో నులిపురుగులను నివారిద్దామని డాక్టర్ యుగంధర్ పిలుపునిచ్చారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని కెజిబివిలో విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల్లో నులిపురుగులు ఉంటే రక్తహీనతతోపాటు ఎదుగుదల, ఏకాగ్రత ఉండదన్నారు. కావున ప్రతి చిన్నారికీ ఆల్బెండజోల్ వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నిర్మలాకుమారి, సిడిపిఒ ఉమా శంకరమ్మ, మెడికల్ ఆఫీసర్ ఎస్ఒ, సిహెచ్ఒ, ఎంపిహెచ్ఎస్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల విద్యాలయంలో స్టాఫ్ నర్స్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా స్టాఫ్‌నర్స్ నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లా అధికారులు ఆదేశాల మేరకు అంగన్‌వాడీ సెంటర్లతోపాటు పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం పాఠశాలలో సుమారు 508 మంది విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బండారు ప్రభాకర్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ భ్రమరాంబ, వైద్య సిబ్బంది నాగలక్ష్మి, మేరీ ఆశావర్కర్ పుష్పలత, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, పాల్గొన్నారు.

ఆత్మకూరు : జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనూషాదేవి, ఎంపిడిఒ విజయ్‌ప్రసాద్, వైద్యులు దయాకర్, ఇఒఆర్‌డి సత్యబాబు, హెడ్‌మాస్టర్ రాఘవయ్య, ఎంపిహెచ్ ఇఒ నాగేశ్వరయ్య, మునాఫ్, సీహెచ్ఓ చంద్రావతి, పీహెచ్ఎన్ తొలిసమ్మ, వెంకటరత్నమ్మ, ఎఎన్ఎంలు, ఆశాలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : విద్యార్థి దశ నుంచి వ్యక్తిగత పరిశుభ్రతో పాటు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని డిఎల్‌డిఒ శంకర్ సూచించారు. జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల పరిధిలోని మల్లికార్జునపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఇఒ విజయకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మల, మూత్ర విసర్జన తర్వాత చేతులు, కాళ్లను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఫల్గునప్రసాద్, ఆరోగ్య కార్యకర్తలు నాగలక్ష్మి, జయమ్మ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


శింగనమల మండలంలో నులిపురుగుల దినోత్సవ పోస్టర్లను విడుదల చేస్తున్న వైద్యసిబ్బంది

పెద్దపప్పూరు : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఇందులో భాగంగా మండలంలోని అమ్మలదిన్నె ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైద్యులు కళ్యాణ్‌కుమార్ విద్యార్థులకు మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపప్పూరు మండల ఆశా, ఆరోగ్య, సూపర్‌వైజర్, సిబ్బంది పాల్గొన్నారు.

కుందుర్పి : జాతీయ నులి పురుగులు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల వ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి అనూషాదేవి, డాక్టర్ చాంద్ బేగం, సర్పంచి మారుతేశ్వరి రామమూర్తి, జిల్లా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, స్కూల్ కమిటీ ఛైర్మన్ లక్ష్మణమూర్తి, ఎంపిటిసి గంగమ్మ హనుమంతరాయుడు, ఆలూరు నరేష్, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


కుందుర్పి మండలంలో పిల్లలకు నులి పురుగుల నివారణ మాత్రలు వేస్తున్న డాక్టర్ అనూషాదేవి

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

కళ్యాణదుర్గం : పెళ్లి సంబంధం కుదరడం లేదని మనస్థాపానికి గురైన దిలీప్ (23) మంగళవారం ఆత్మహత్య చేసుకున్న ఘటన మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు... నాగమణి, గంగాధర కుమారుడైన దిలీప్‌నకు పలుచోట్ల పెళ్లి సంబంధాలు చూసినా కుదరడం లేదు. దీంతో మనస్థాపానికి గురయ్యేవాడు. ఈనేపథ్యంలో తల్లిదండ్రులు బంధువుల ఊరికి వెళ్లడంతో ఇంట్లో ఏవరూ లేనిసయంలో దూలానికి ఉరేసుకున్నాడు. గమణించిన స్థానికులు తల్లిదండ్రులు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తలిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఆత్మహత్య చేసుకున్న దిలీప్

చిలమత్తూరు : మండల పరిధిలోని కొడికొండ చెక్‌పోస్ట్ ఎక్సైజ్ కార్యాలయం వెనుక గల సమర్థనం ట్రస్ట్ కి సంబందించిన హాస్టల్ లో గోపాల్‌కృష్ణ(28) అనే వికలాంగ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాత్రూం లో ఉరి వేసుకొని మృతిచెందాడన ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. సమర్థనం ట్రస్ట్ అందించే కోర్స్ కోసం రొద్దం మండలం నారనాగేపల్లి గ్రామానికి చెందిన గోపాల్‌కృష్ణ రెండు నెలల క్రితం చేర వారు నిర్వహించే హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ మధ్యకాలం చూపు మందగించడంతో మనస్థాపానికి గురైన గోపాలకృష్ణ ఆ హాస్టల్ లోని బాత్రూంలో ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి తండ్రి ఈడిగ నరసింహులు పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

నాటుసారా విక్రేత అరెస్టు

గుత్తి : మండలంలోని కొత్తపేట గ్రామంలో హైవే బ్రిడ్జి వద్ద సెబ్ పోలీసులు మంగళవారం నాటుసారా విక్రేతను అరెస్టు చేశారు. తొండపాడు గ్రామానికి చెందిన భూలక్ష్మి నాటసారా తరలిస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకుని 10 లీటర్ల నాటుసారాను సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితురాలిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మడకశిరలో దొంగల హల్‌చల్

మడకశిర : మడకశిర పట్టణంలో సోమవారం రాత్రి మారుతి నగర్‌లోని16 ,17వ వార్డులలో దొంగలు హల్‌చల్ చేశారు. ఏకకాలంలో ఐదు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు .దాదాపు ఆరు లక్షల రూపాయలు విలువ చేసే బంగారు నగల తో పాటు 60 వేల రూపాయలు నగదును దోచుకెళ్లినట్లు బాధితులు వాపోయారు. రాత్రుల్లో పోలీసుల గస్తీ నామ మాత్రంగా చేస్తుండటం వల్ల పట్టణంలో దొంగతనాలు ఎక్కువయ్యాయన్న ఆరోపణలు బలంగా విన వస్తున్నాయి. మారుతి నగర్ లో నలుగురు వ్యక్తులు షార్ట్స్ వేసుకుని మాస్కులు ధరించి అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో ఐదు ఇళ్లలో తాళాలు పగల గొట్టి గుల్ల చేసి వెళ్ళి పోయారు.

ఈవ్‌టీజర్ అరెస్టు

బుక్కపట్నం : ప్రేమ పేరుతో అమ్మాయిల పట్ల అసభ్యంగా వ్యవహరిస్తూ ఫోటోలు వీడియోలు మార్ఫింగ్ చేస్తూ బ్లాక్ మెయిల్ చేస్తున్న విశాఖపట్నం ప్రాంతానికి చెందిన చంద్రమౌళి అనే వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గానికి చెందిన ఒక యువతిని వేధిస్తున్నాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పుట్టపర్తి డీఎస్పీ యశ్వంత్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టామన్నారు. నిందితుడు చంద్రమౌళి వివాహం చేసుకొని కూడా చదువుకున్న అమ్మాయిలని లక్ష్యంగా పెట్టుకొని ప్రేమ పేరుతో నటిస్తూ వారికి తెలియకుండా వారికి తెలియకుండా ఫోటోలతో మార్ఫింగ్ చేస్తూ బ్లాక్ మెయిల్ చేసేవాడన్నారు. ఇదే అలవాటుగా చేసుకొని కొన్ని సంవత్సరాలుగా నిందితుడు వైజాగ్, హైదరాబాద్ ప్రాంతాల్లో ఉంటూ ప్రేమ పేరుతో మోసాలకు పాల్పడుతూ అమ్మాయిలను బెదిరిస్తూ, అమ్మాయిల కుటుంబ సభ్యులకు ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ బెదిరించేవాడని తెలిపారు. బాధిత యువతి ఫిర్యాదు మేరకు టీములుగా ఏర్పడి మామిళ్ళకుంట క్రాస్ వద్ద నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం నైపుణ్యంలో అమ్మాయిలు జాగ్రత్తగా ఉంటూ ఇటువంటి మోసాలకు మోసపోకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

బీ ఫార్మసీ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు పరిధిలోని బీ.ఫార్మసీ రెండవ సంవత్సరం రెండవ సెమిస్టర్ సప్లిమెంటరీ (ఆర్.19), బీ.ఫార్మసీ రెండవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్.15) సప్లిమెంటరీ పరీక్ష పలితాలను మంగళవారం విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఇ. కేశవరెడ్డి, కంట్రోలర్ బి.చంద్రమోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షా పలితాల కోసం http://jntuaresults.ac.inను సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

ఉరవకొండ : ఉరవకొండలో ఏర్పాటు చేసిన మూడు సెంటర్లలో నేటి నుంచి ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మమత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్‌గా ఎన్.మమత పర్యవేక్షిస్తారన్నారు. ఈ సెంటర్‌లో 301 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల చీఫ్ సూపరింటెండెంట్‌గా ఇమ్మానియేల్ పర్యవేక్షిస్తారన్నారు. ఈ సెంటర్‌లో 220 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. అలాగే మండల పరిధిలోని చిన్నముష్టూర్ గ్రామంలో ఉన్న ఆదర్శ పాఠశాల చీఫ్ సూపరింటెండెంట్‌గా ప్రసన్థకుమారి పర్యవేక్షణలో 220 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 8:30లోపు విద్యార్థులకు ఆయా కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షల కోసం ఏర్పాటు చేసిన కేంద్రాలను ప్రిన్సిపాల్ బాలప్పతో కలిసి ఎస్ఐ రాఘవరెడ్డి మంగళవారం పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రానికి 100 మీటర్ల దూరం వరకు జిరాక్స్ సెంటర్లు బంద్ చేయించనున్నట్లు తెలిపారు. అలాగే విద్యార్థులు నిర్ణీత సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. సెల్‌ఫోన్లు తీసుకొని రావద్దన్నారు. పరీక్ష కేంద్రంలోని ప్రతి గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ బాలప్ప తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇద్దరు పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు

సిఎం జగన్‌తోనే మైనార్టీల సంక్షేమం

మేయర్ మొహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌తోనే మైనార్టీల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. మంగళవారం నగరంలోని 39వ డివిజన్ పరిధిలో క్లాప్ కార్యక్రమం అమలవుతున్న తీరును మేయర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ క్లాప్ కార్యక్రమం ద్వారా నగరంలో 33 వాహనాలను ఏర్పాటు చేసి ఇంటింటి చెత్త సేకరణ చేపట్టినట్లు తెలిపారు. సిఎం జగన్ కూడా క్లాప్ కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ రూ.కోట్ల నిధులను విడుదల చేస్తున్నారన్నారు. ఇంటింటి చెత్త సేకరణ చేపట్టి నగర పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తుంటే కొందరు భవన నిర్మాణ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ రోడ్లుపై, ఓపెన్ సైట్లలో వేస్తుండడం బాధాకరమన్నారు. ప్రజలు కూడా సహకరించి భవన నిర్మాణ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. అలాగే అన్ని ప్రధాన రహదారుల అభివృద్ధితోపాటు అంతర్గత రహదారులు, డ్రెయినేజీల అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. మతపెద్దలతో సిఎం జగన్ సమీక్ష నిర్వహించి రాష్ట్రంలో ముస్లింల అభ్యున్నతికి ఏమైనా కృషి చేయాలా.. అని అడగటం ముస్లింపై ఉన్న ప్రేమకు నిదర్శనమన్నారు. దేశ చరిత్రలోనే తొలిసారిగా మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతోందన్నారు. నాలాంటి సామాన్యుడు మేయర్ అయ్యానంటే అది వైసిపిలో మాత్రమే సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రెడ్డి, నాయకులు మధు, ఖాజా, రఫీ, తదితరులు పాల్గొన్నారు.


విలేకరులో మాట్లాడుతున్న మేయర్ మహమ్మద్ వసీం


విలేకరులతో మాట్లాడుతున్న ముస్లిం మైనారిటీ నాయకులు

జామియా మసీద్ ముతవల్లిపై విచారణ హర్షణీయం


ప్రజాశక్తి -అనంతపురం

నగరంలోని జామియా మసీద్ ముతవల్లి షఫీవుల్లా కుమారుడు ఫకీల్‌షఫీ అధికార దుర్వినియోగంపై ప్రభుత్వం విచారణకు ఆదేశించడం స్వాగతిస్తున్నామని ముస్లిం నాయకులు చాంద్‌బాషా, రియాజుద్దీన్, ఆన్సర్, మన్సూర్‌బాషా, ఎస్ఎం బాషా, ముహేబ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం నగరంలోని జామియా మసీద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మసీదులో అధికార దుర్వినియోగం జరిగిందని సిఎం జగన్‌కు విన్నవించడంతో స్పందించిన ఆయన 20 రోజుల క్రితం వారిని విధుల నుంచి తొలగించారన్నారు. అంతేగాకుండా విచారణకు ఆదేశించడం సంతోషకరమన్నారు. దాదాపుగా నెలకు రూ.17 లక్షల ఆదాయంతో రాష్ట్రంలోనే అనంతపురం జామియా మజీద్ ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఎంతో ఆర్థిక పుష్టి కలిగిన ఈ మసీదు ద్వారా అనంతపురం వక్ఫ్ బోర్డు నుంచి పేదల పెళ్లిళ్లకుగానీ, పేరంటాలకుగానీ, పురోగతిగానీ, విద్యాభివృద్ధికిగానీ, ఉపాధి కల్పనలోకుగానీ నోచుకోకపోవడం బాధాకరమన్నారు. పూర్తిస్థాయిలో విచారించి మసీదు అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఇందుకు సహకరించిన ఎపి రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ హెచ్.నదీమ్‌అహ్మద్, మంత్రి ఉషాశ్రీచరణ్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, ఎంపీ తలారి రంగయ్య, వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ ఖాదర్‌బాషాకు కృతజ్ఞతలు తెలిపారు.

దళితుడిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండల పరిధిలోని పిల్లలపల్లి గ్రామానికి చెందిన దళిత శ్రీరాములుపై దాడి చేసిన వారిని అరెస్టు చేసి శిక్షించాలని ఎపి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ జెఎసి, ఎమ్మార్పీఎస్ నాయకులు చెలమప్ప, పాలవాయి సుధాకర్, డాబా రమేష్ మాట్లాడుతూ కళ్యాణదుర్గం నియోజవర్గంలో రోజురోజుకూ దళితులపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. ఇందులో భాగంగానే మండలంలోని పిల్లలపల్లి గ్రామంలో బస్టాండ్‌లో దళిత శ్రీరాములను చొక్కా పట్టుకుని, చెప్పులు చూపుతూ అగ్రకులానికి చెందిన వారు కులం పేరుతో దూషిస్తూ దాడి చేయడం బాధాకరమన్నారు. దాడికి పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముప్పులకుంట ధను, నాయకులు చిన్న మారెన్న, రమేష్, వన్నూరుస్వామి, మీసేవ ఏసేపు, వంటిరెడ్డిపల్లి నాగరాజు, కురాకులపల్లి గోపాల్, మాదిగ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

ఎంపిపి చంద్రమ్మ, జెడ్పిటిసి పార్వతమ్మ

ప్రజాశక్తి-ఉరవకొండ

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిపి చందా చంద్రమ్మ, జెడ్పిటిసి ఎసి పార్వతమ్మ ఆదేశించారు. ఉరవకొండ సచివాలయం-3 పరిధిలోని 1వ వార్డులో జరుగుతున్న డ్రెయినేజీ నిర్మాణం పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనులకు ఐదు సచివాలయాలకు కలిపి ఇప్పటి వరకు రూ.1.కోటి నిధులు మంజూరైనట్లు తెలిపారు. వీటిలో వివిధ దశల్లో పనులు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కో అప్షన్ సభ్యులు పామిడి సలీమ్, పార్టీ పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడు బసవరాజు, జెసిఎస్ పట్టణ అధ్యక్షుడు ఆసిఫ్, 1వ వార్డు సభ్యులు శర్మస్, పట్టణ ఉపాధ్యక్షుడు మొమిన్ జిలాన్, సచివాలయ కన్వీనర్లు పామిడి షాహిదా, మద్దికెర అన్వర్, కొత్తపల్లి చంద్ర, నాయకులు యూసుఫ్, తయూబ్, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.



డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న ఎంపిపి చందా చంద్రమ్మ, జెడ్పిటిసి ఎసి పార్వతమ్మ, తదితరులు

ఆర్టీసీని లాభాల బాటలో నడిపిద్దాం

రీజినల్ మేనేజర్ సుమంత్ ఆధోని

ప్రజాశక్తి-ఉరవకొండ

ఆర్టీసీని లాబాల బాటలో నడిపించేందుకు ప్రతి ఒక్కరూ శక్తి వంచన లేకుండా కృషి చేయాలని అనంతపురం రీజినల్ మేనేజర్ సుమంత్ ఆధోని కోరారు. ఈమేరకు స్థానిక ఆర్‌టిసి డిపోను రీజినల్ మేనేజర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా డిపో మేనేజర్ బాలాజీ దయాల్‌తో కలిసి బస్సుస్టేషన్ పరిసరాలతో పాటు గ్యారేజ్‌లో ఉన్న అన్ని విభాగాల సెక్షన్లు, కార్గో పార్శిళ్లను తనిఖీ చేశారు. అనంతరం డిపో పరిధిలోని అన్ని విభాగాల సిబ్బందితో డిపో అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ లాభాల బాటలో పయనించాలంటే కాలానుగుణంగా తీసుకోవాల్సిన వార్పులను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. అంతేగాకుండా ప్రతి ఒక్కరు తమ పరిధిలో శక్తి వంచన లేకుండా సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


ఆర్టీసీ సిబ్బందితో మాట్లాడుతున్న రీజినల్ మేనేజర్ సుమంత్ ఆధోని

సర్పంచిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ : కూడేరు మండలం గొట్కూరు వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వజ్రకరూరు మండలం రాగులపాడు సర్పంచు శ్రీనివాస్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మంగళవారం పరామర్శించారు. శ్రీనివాస్‌రెడ్డి బెంగళూరులో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, బిసి విభాగం జిల్లా అధ్యక్షులు సీపీ.వీరన్న, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రమణ తదితరులు మంగళవారం బెంగళూరుకు వెళ్లి పరామర్శించారు.


రాగులపాడు సర్పంచు శ్రీనివాస్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

17న జెఎన్‌టియు పిహెచ్‌డి కోర్సుకు అడ్మిషన్లు

అనంతపురం : స్థానిక జెఎన్‌టియులో మిగిలిన పిహెచ్‌డి సీట్లకు ఈనెల 17న స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ద్వారా ప్రవేశాలు కల్పించనున్నట్లు వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ బి.ఈశ్వర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులకు అడ్మిషన్లు పొందాలనుకునే వారు తప్పనిసరిగా ఎపిఆర్ఇ సెట్-2022 లో అర్హత సాధించి సంబంధిత డిగ్రీలో ఉత్తీర్ణులైన వారు మాత్రమే అర్హులన్నారు. అర్హత కలిగి, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఒరిజినల్ సరిఫికెట్లతోపాటు జిరాక్స్ కాపీలను తీసుకుని ఈనెల17న ఉదయం 10 గంటలకు జెఎన్‌టియు పరిపాలన భవనం అడ్మిషన్స్ డైరెక్టర్ ఆఫీసులో సంప్రదించాలని కోరారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని బాచుపల్లి -ధర్మాపురం గ్రామాల మధ్యలో పొలిమేర పెద్దమ్మ తల్లి నూతన ఆలయం, విగ్రహ ప్రతిష్టాపన మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెద్దమ్మ అమ్మవారి ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ట సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున నుంచి అమ్మవారికి ఆకు పూజలు, అభిషేకాలు, అర్చన, హారతులు ఇచ్చారు. అనంతరం మహా మంగళ హారతిగావించి తీర్థ ప్రసాదాలను అందించారు. తర్వాత ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో ధర్మాపురం సర్పంచి మక్కెల చంద్ర, మాజీ సర్పంచి శ్రీనివాసులు, నాయకుడు తెగదొడ్డి తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పెద్దమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

గ్రంథాలయం తనిఖీ

ధర్మవరం టౌన్ : ధర్మవరం శాఖ గ్రంథాలయాన్ని జిల్లా కార్యదర్శి రమ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సభ్యత్వంతోపాటు ప్రతి రోజు గ్రంథాలయానికి ఎంతమంది పాఠకులు వస్తున్నారు తదితర విషయాలను గ్రంథాలయ శాఖ అధికారిణి అంజలి, సౌభాగ్యవతిని అడిగితెలుసుకున్నారు.